ప్రభుత్వంపై 'అన్నదాత పోరు'

- ఎరువుల కోసం రైతుల అవస్థలు
- పంటలకు గిట్టుబాటు ధరలు కరువు
- నేడు రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ ఆందోళన

ఆత్మకూరు: అధికారంలోకి వచ్చింది మొదలు.. కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసింది. అన్నదాతలను ఆదుకోవడంలో విఫలమైంది. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, పంటలు కోల్పోయిన వారికి పరిహారం అందజేయకపోవడం .. చివరకు పంటలకు యూరియా సకాలంలో అందజేయకపోవడంతో రైతులు రోడ్డున పడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎరువులు, ఫర్టిలైజర్స్ దుకాణాల వద్ద ఎక్కడ చూసినా రైతుల బారులు దర్శమిస్తున్నాయి. దిగుబడులకు ధర లేక రైతాంగం నష్టపోతున్నా సర్కారుకు చీమకుట్టినట్లయినా లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు అన్నదాత పోరు పేరుతో రైతాంగ సమస్యలపై పోరుబాటుకు సిద్ధమయ్యారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. ఇందుకు ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు భారీగా ఆత్మకూరు తరలిరానున్నారు.

నియోజకవర్గంలో..

శ్రీశైలం నియోజకవర్గంలో ఈ ఏడాది దాదాపు 37 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 35వేల ఎకరాల్లో వరి, 4వేల ఎకరాల్లో పత్తి, 2వేల ఎకరాల్లో మినుము, కంది పంటలను రైతులు సాగుచేశారు. అనావృష్టి, అతివృష్టి వల్ల చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. అయితే ఇందుకు సంబంధించిన నష్టపరిహారం ప్రభుత్వం రైతులకు అందజేయలేదు. అలాగే.. పంటలకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచకపోవడంతో ప్రభుత్వం తీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలకు మద్దతుగా మంగళవారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ కన్వీనర్ సుధీర్ ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతి పత్రం అందించి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధమయ్యారు.


ఆత్మకూరులో యూరియా కోసం బారులుదీరిన రైతులు (ఫైల్)


కొత్తపల్లిలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎరువులు ఏవీ?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ఎరువులు అందేవి. ఎక్కడా కొరత ఉండేది కాదు. ప్రస్తుతం ఎరువుల కొరత తీవ్రంగా ఉంది. పంటలు ఏపుగా పెరుగుతున్న సమయంలో యూరియా సరఫరా పడిపోయింది. యూరియా లేక బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. యూరియా బస్తా రూ.266 ఉండగా రూ.400కు పైగా అమ్ముతున్నారు. అయినా ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైంది.వైఎస్సార్‌సీపీ పార్టీ పోరుబాటకు సిద్ధం కావడంతో కూటమి ప్రభుత్వం ఇదిగో యూరియా అంటూ ఊదరగొడుతోంది.

– మహబూబ్‌బాషా, ఆత్మకూరు

నష్ట పరిహారం చెల్లించాలి



ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో మొక్కజొన్న, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో నదులు, వాగులు పొంగి వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం దాదాపు 4 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేలు చొప్పున నష్టపరిహారం అందించాలి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పరిహారం చెల్లించలేదు.

– నాగులునాయక్, ఎస్ఎస్ తండా

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయండి

కొత్తపల్లి: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి పిలుపుచ్చారు. సోమవారం మండల కేంద్రంలో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేశారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమాన్ని రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో-ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, ఎంపీటీసీ బాలరాజు, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ నాగఎల్లయ్య, మండల వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ మునిరంగ, వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయల వద్ద మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేసి అన్నదాతలకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాగభూషణం రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, శాతనకోట సర్పంచ్ జనార్దన్ గౌడ్, కోళ్లబాపురం సర్పంచ్ నాగార్జున,విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలిరండి

ఆత్మకూరు: పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ కోరారు. ఉదయం 10 గంటలకు బైకు ర్యాలీని స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై కొత్త బస్టాండు, ఎంపీడీఓ కార్యాలయం, చక్రం హోటల్ మీదుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంటుందని, అక్కడ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ కన్వీనర్ సుధీర్‌తో పాటు పలువురు పార్టీ శ్రేణులు ప్రసంగిస్తారని తెలిపారు.


నందికొట్కూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ర్యాలీని విజయవంతం చేయండి



రైతులకు కూటమి ప్రభుత్వం అండగా లేకపోవడం మనస్సును కలచివేస్తుంది. నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న పంటలకు యూరియా అత్యవసరం. కానీ ప్రభుత్వం అరకొరగా యూరియా సరఫరా చేస్తోంది. అలాగే.. వచ్చిన యూరియాను టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పక్కదారి పడుతున్నాయి. దీంతో అన్నదాతలు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. కర్షకులు అవస్థలు పడుతున్నా..టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎందుకు పట్టించుకోవడం లేదు? రైతన్నల పరిస్థితిపై నోరుమెదపని ఈ ప్రభుత్వంపై వారే గుణపాఠం చెప్పాలి. మంగళవారం నిర్వహిస్తున్న అన్నదాత పోరుకు రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలి.

– శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

గిట్టుబాటు ధర ఏదీ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంటలకు గిట్టుబాటు ధర కరువైంది. అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలో ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లేదు.దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మినుములు క్వింటా రూ.10 వేల నుంచి, రూ.11 వేలకు పైగా విక్రయిస్తే, కూటమి ప్రభుత్వంలో రూ.6 వేల నుంచి రూ.7 వేలు మించలేదు. నాడు క్వింటా ఎండుమిర్చి రూ.26 వేల నుంచి రూ.32 వేలకు పైగా కొనుగోలు జరిగితే, ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.18 వేల ప్రకారం మాత్రమే అమ్మకాలు జరిగాయి. వరి 70 కేజీల బస్తా అప్పట్లో రూ.3 వేలు దాటితే కూటమి ప్రభుత్వంలో రూ.1600 నుంచి రూ.2 వేలు మాత్రమే పలికింది. కందులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో క్వింటా రూ.12 వేల నుంచి రూ.14 వేలకు అమ్మగా.. నేడు రూ.6 వేల ప్రకారం కొంటున్నారు. గతంలో ఉల్లి క్వింటా రూ.10 వేలకు పైగా ఉండగా నేడు రూ.వెయ్యి లోపు మాత్రమే ఉంది.

– రామచంద్రుడు, కొత్తరామాపురం

క్లుప్తంగా

మల్లన్నకు శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ


సహస్రదీపాలను వెలిగిస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేద మంత్రోచ్చారణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. అనంతరం మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులు గావించి ఆలయ ప్రదక్షిణ జరిపించారు.

శేష జీవితాన్ని సంతోషంగా గడపాలి


పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఎస్‌ఓ, సిబ్బంది

పాములపాడు: పదవీ విరమణపొందిన తరువాత శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని ఎస్ఓ రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ తిరుపతీదేవి, నైట్ వాచ్‌మన్ ప్రభావతిని దుశ్శాలువా, పూల మాలతో సత్కరించారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు.

అలరించిన హరికథాగానం


హరికథాగానం చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్య కళా వేదికపై కర్నూలుకు చెందిన టి.రాం భాగవతార్ భూకైలాస్ హరికథాగానం వినిపించారు. కార్యక్రమానికి మృదంగ సహకారాన్ని బి.కె.సాయిచరన్, వయోలిన్ సహకారాన్ని బి.కె.యశ్వంత్ అందించారు.

నేత్రదానం మహాదానం

ఆత్మకూరురూరల్: చీకటి మయమైన జీవితాలు గడిపే అంధులకు కంటి చూపునివ్వగల నేత్రదానం ఎంతో గొప్పదని ఆత్మకూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు అన్నారు. నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తులు మరణించిన అనంతరం వారి కుటుంబ సభ్యుల ముందస్తు అనుమతితో వారి నుంచి కళ్లలోని కార్నియాను సేకరిస్తారన్నారు. ఆ కార్నియాలతో ఇద్దరికి చూపునివ్వవచ్చని చెప్పారు. వైద్యాధికారి షేక్షావలి, వైద్యులు హనీఫ్,కవిత, లక్ష్మి ప్రసన్న,మస్తాన్ వలి పాల్గొన్నారు.

పంచమఠాల్లో విశేష పూజలు


సారంగధర మఠంలో స్వామివారికి పూజలు చేసిన దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోక కల్యాణార్థం పంచమఠాల్లో అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకర మఠం, విభూతి మఠం, రుద్రాక్ష మఠం, సారంగధర మఠాల్లో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పం పఠించి ఘంటా మఠంలోని గణపతికి పూజలు చేపట్టారు. అనంతరం అన్ని మఠాల్లో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలు నిర్వహించారు. దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికా రి హరిదాసు, పర్యవేక్షకులు హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఖాళీ ప్రదేశాలలో రసాయన మందును వైద్యుడు మహమ్మద్‌బేగ్ ఆధ్వర్యంలో పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎంఎంహెచ్‌పీ శైలజ, హెల్త్ అసిస్టెంట్ శ్రీరాములు నాయక్ పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం


దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం టెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన గాయత్రి సోమవారం రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు శివప్రసాద్‌కు అందజేశారు.

బస్సు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

పగిద్యాల: విద్యార్థి బస్సు సమయానికి నడపాలని తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించిన ఘటన లక్ష్మాపురంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుమారు 150 మంది విద్యార్థులు ప్రతి రోజూ నందికొట్కూరు పట్టణానికి చదువుల కోసం వెళ్తున్నారు. ఉదయం 9 గంటలకు రావాల్సిన విద్యార్థి బస్సు సమయానుసారం నడపకపోవడం వలన పాఠశాల, కళాశాలల్లో అటెండెన్స్‌ను కోల్పోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజు ఆలస్యంగా వెళ్లడం వలన క్లాస్‌లను తప్పిపోతున్నారని 75 శాతం హాజరు లేకపోతే తల్లికి వందనం పథకం వర్తించదని మండిపడ్డారు. కండిషన్‌తో ఉండే బస్సులను గ్రామీణ ప్రాంతాలకు తిప్పాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. కళాశాల, పాఠశాల పని వేళలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయని 8.30 గంటల కల్లా తమ గ్రామానికి విద్యార్థి బస్సును వేయాలని కోరారు.


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రోడ్డుపై సుమారు గంటకు పైగా విద్యార్థుల రాస్తారోకో చేపట్టడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్నా ముచ్చుమర్రి స్టేషన్ ఏఎస్ఐ శేషయ్య ఘటనా ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని పోలీసు ఉన్నతాధికారులు, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు ఉదయం 9 గంటలకు విద్యార్థి బస్సు లక్ష్మాపురంలో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించి వెళ్లిపోయారు.

అక్షరాస్యతతోనే కుటుంబ ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న వయోజన విద్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి

పాములపాడు: కుటుంబంలో అందరూ అక్షరాస్యులైతే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని వయోజన విద్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. 59వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలకు సెలవుల సమయంలో వారి తల్లిదండ్రులకు కనీసం పేరు రాయడం, బస్సు సర్వీసులపై ఊర్ల పేర్లు చదవడం, రాయడం నేర్పించే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అనంతరం సాంస్కృతిక పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ-2 సుభాషిణీదేవి, వయోజన విద్య జిల్లా పర్యవేక్షకులు శ్రీనివాసులు, ఆదినరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: పట్టణంలో వైరల్ జ్వరాలు అధికమయ్యాయని, సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా వైద్య సిబ్బంది స్పందించనందున వెంటనే పట్టణంలో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, పట్టణ నాయకులు సురేంద్ర, ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 60 వేల జనాభా, 17 వేల గృహాలు ఉన్నాయని, ఏ వీధిలోకి వెళ్లినా ప్రతి 10 గృహాలకు ఒకరికి చొప్పున వైరల్ గృహాలు సోకి ఇబ్బందులు పడుతున్నారని, జలుబు, దగ్గు వంటి వ్యాధులతో మంచం పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వైద్యశాలలో కర్నూలును తలపించేలా అధిక మొత్తంలో గుంజుతున్నారని మండిపడ్డారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పట్టణంలోని అన్ని సచివాలయాల వద్ద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించాలని కోరారు. అన్ని వీధుల్లో పారిశుద్ధ్య పనులు, ఫాగింగ్ చేయాలన్నారు. నాయకులు రమణ, పుల్లయ్య, నూర్‌మహ్మద్, మాబాషా, ముర్తుజావలి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

కొత్తపల్లి: స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు పూర్తిగా చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి యేసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల కార్యదర్శి బి హనుమంతు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ లో ఎంపీడీఓ మేరికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ కార్మికులకు దాదాపు 20 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. దీంతో కార్మికుల కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కార్మికులు రాజారావు, శ్రీరాములు, సుబ్బరాయుడు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

నందికొట్కూరు: ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులకు మిడుతూరు మండల విద్యాశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. సోమవారం మిడుతూరు ఎంఈఓ కార్యాలయంలో అవార్డు గ్రహీతలు కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు , తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ-ఫైజున్నీసాబేగం, ఎంఈఓ-2 మల్లికార్జున నాయక్ సన్మానించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నందికొట్కూరు: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎస్‌యూఐ నందికొట్కూరు అధ్యక్షుడు సాయి కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. నందికొట్కూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం ఐదు నెలలు అయిన విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మంత్రి లోకేష్ విద్యను ప్రోత్సహిస్తున్నామని ప్రకటనలకే పరిమితం అయ్యారు తప్ప ఆచరణలో లేవని విమర్శించారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

నందికొట్కూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలను విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిడుతూరు మండల కేంద్రంలో సోమవారం చెన్నకేశవస్వామి దేవాలయం ఆవరణలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తు న్న కూలీలకు 16 వారాలుగా వేతనాలు విడుదల చేయకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం గోపాల్, జిల్లా కోశాధికారి ఎస్ రమణ శెట్టి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు పి మజీద్ మియా, నాయకులు బి ఎల్ల నాయుడు, ఆర్ పుల్లన్న, లింగం తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పాములపాడు: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వడ్డెరలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏపీ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. హక్కుల సాధనకు వడ్డెరలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఎకరాకు రూ.40వేలు నష్టపరిహారం ఇవ్వాలి

పాములపాడు: తుపాన్, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ.40,000 నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు ఒక ఎత్తైతే వరద రాజస్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తడం ద్వారా నీరు భవనాశి వాగు కు ఉధృతంగా రావడంతో పాములపాడు, ఇస్కాల, చెలిమిల్ల, లింగాల గ్రామాల్లో పంట పొలాలు పూర్తి గా నీట మునిగి కుళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. నాయకులు శీలన్న, అబ్దుల్ సలాం, సోమన్న, శేఖర్, సోమప్ప, మాబాషా పాల్గొన్నారు.

ఏపీఓకు డాక్టరేట్


వసుధా రెడ్డి

బండి ఆత్మకూరు : ఉపాధి హామీ పథకంలో ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న వి.వసుధారెడ్డి ద్రవిడ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఆచార్య జి.జానకిరామయ్య పర్యవేక్షణలో వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి, రామాపురం, టి. సుండుపల్లి మండలాల్లో ఇందిరా క్రాంతి పథకంలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులపై పరిశోధన పత్రం సమర్పించడంతో యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసిందని చెప్పారు.

అధికారుల సమక్షంలో యూరియా పంపిణీ


కొత్తపల్లిలో యూరియా పంపిణీ చేస్తున్న ఏఓ అమిరున్నీసాబేగం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని మనగ్రోమోర్ సెంటర్‌కు సోమవారం యూరియా లోడు వచ్చింది. దీంతో రైతులు మనగ్రోమోర్ సెంటర్ వద్ద గుమికూడారు. అప్రమత్తమైన మండల వ్యవసాయాధికారి అమిరున్నీసాబేగం, తహసీల్దార్ ఉమారాణి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసుల బందోబస్తు నడుమ పొలం పాసుపుస్తకానికి ఒక్కో యూరియా బస్తా చొప్పున రైతులకు పంపిణీ చేశారు. మండలంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా తెప్పిస్తామని, కొరత లేకుండా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న అన్నారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం

పాములపాడు: అవసరమైన ప్రతి రైతుకు యూరియా అందజేస్తామని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పాములపాడు, మద్దూరు గ్రామాల్లోని ప్రైవేటు డీలర్ల దుకాణాల యూరియా పంపిణీని పర్యవేక్షించారు.

విజయవంతం చేయండి

ఆత్మకూరు: ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి కలిగిస్తున్న బోధనేతర కార్యక్రమాల రద్దు చేయాలని ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన రణభేరి జాతాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆత్మకూరులో యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూల్యాంకనం పాత పద్ధతిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమయం అంతా మూల్యాంకనానికే సరిపోతుందని, బోధనకు ఇబ్బందిగా మారిందన్నారు. పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి రకరకాల ఆన్‌లైన్ పనులతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారన్నారు. బోధనపై దృష్టి సారించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ రణభేరీ జాతాకు పిలుపునిచ్చిందన్నారు. సీనియర్ నాయకులు బాలాజీరావు, నిజాముద్దీన్, అమీర్‌అహ్మద్, రామకృష్ణ, శంకర్, నాగరాజు, బొజ్జయ్య, రమణ, ఇక్బాల్‌బాషా పాల్గొన్నారు.

వీబీఆర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాల విడుదల కొనసాగుతోంది. బా నకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు సోమ వారం వీబీఆర్‌కు 13,750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. వీబీఆర్ నుంచి దిగువకు 13,400 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఏఈ శివ నాయక్ తెలిపారు. ప్రస్తుతం 15.594 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

భవిష్యత్ మార్గనిర్దేశకుడు గురువే

ఆత్మకూరు: ప్రతి ఒక్కరి భవిష్యత్‌కు మార్గనిర్దేశకుడు గురువేనని డిపాల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ సీన్స్ అన్నారు. సోమవారం కరివేన గ్రామంలోని డీపాల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫాద ర్ రాయ్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏఓ ఫాదర్ శాంటో, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఫాదర్ సీన్స్

పరామర్శ

ఆత్మకూరు: మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్ల వద్దకు వెళ్లి సోమవారం పరామర్శించారు. పట్టణంలోని 1వ వార్డు కౌన్సిలర్ కలీముల్లా కుమారుడు బాషా గత శనివారం పోలీసుల దాడుల్లో గాయపడిన విషయం తెలిసిందే. దీంతో బాధిత కుటుంబాన్ని శిల్పా పరామర్శించి ధైర్యం చెప్పారు. కిషన్‌సింగ్ వీధి 3వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు సద్దాం ఇంటికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. అదే వార్డులోని మాజీ కోఆప్షన్ సభ్యుడు జాకీర్ తల్లి, భార్య మృతి చెందడంతో ఆ కుటంబాన్ని పరామర్శించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు సయ్యద్‌మీర్, నాయకులు లాలు, జాకీర్, కలిముల్లా, ఆంజనేయులు, దగ్గమ్మ, షఫీవుస్, రఫీక్, రాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బండి ఆత్మకూరు : మండలంలోని నారపురెడ్డి కుంట గిరిజన గూడెంలో బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు మాట్లాడుతూ గూడెం వాసులకు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


పసికందును పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

యూరియా పంపిణీలో అవకతవకలు


నంద్యాలలో మాట్లాడుతున్న ఎర్రగుంట్ల రైతులు

బండి ఆత్మకూరు : యూరియా పంపిణీలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎర్రగుంట్ల గ్రామ రైతులు సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామానికి చెందిన రైతులు మధుసూదన్ రెడ్డి, స్వామి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి ఇప్పటి వరకు దాదాపు 2వేల యూరియా బస్తాలు వచ్చాయని, అయితే అధిక భాగం బస్తాలు పక్కదారి పట్టాయని ఆరోపించారు. ఇందుకు కారణమైన రైతు సేవ కేంద్రం సిబ్బంది, వ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.